

# అదే తప్పు

పాలంకి సత్య

పెళ్ళి పూర్తయి అప్పగింతలు జరుగుతున్నాయి. ఆ సమయంలో ఆడపిల్ల తాలూకు వారంతా కన్నీళ్ళు పెట్టుకోవడం ఆనవాయితీ. అందుకు భిన్నంగా వరుడితల్లి జయలక్ష్మి కన్నీళ్ళ పర్యంతంగా ఉంది. పైకి ఏడిస్తే ఈ పెళ్ళి ఈమెకు ఇష్టం లేదని ఆడపెళ్ళి వారనుకుంటారేమోనని ఆమెకు భయం. కన్నీళ్ళను కళ్ళలోనే నిలుపుకున్న ఆమెకు పెళ్ళికి దారితీసిన సంఘటనలు గుర్తొచ్చాయి.

★★★

జయలక్ష్మికి మొదటిసారి కొడుకు సుమన్ పుట్టగానే ఆమె ఆరోగ్యరీత్యా ఇంకొక గర్భం దాల్చకూడదని డాక్టర్లు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసేశారు. దాంతో ఆమెకు సుమనే ప్రపంచమైంది. ''ఎంతసేపూ కొడుకేనా? ఆ కొడుకుని నీకిచ్చిన మొగుడనేవాడు ఒకడున్నాడని గుర్తుందా'' అని ఆమె భర్త జగన్నాథ్ మేలమాడేవాడు. జయలక్ష్మి పట్టించుకునేది కాదు.

సుమన్ పెరిగి పెద్దవాడయ్యాడు. బాగా చదువుకుని ఉన్న ఊళ్ళోనే మంచి ఉద్యోగం సంపాదించుకున్నాడు. అందరి పిల్లలూ అమెరికా ఎగిరి వెళ్ళిపోయే రోజుల్లో కొడుకు స్వదేశంలో అందునా సొంత ఊళ్ళో ఉద్యోగం తెచ్చుకోవడం జయలక్ష్మికి మహదానందమైంది.

''ఇంక వీడికి పెళ్ళి చెయ్యాలి'' అంది జయలక్ష్మి

''కొడుకుని ఇంత గాఢంగా ప్రేమిస్తున్న దానివి

నువ్వు వాడిని కోడలితో కాపురం చెయ్యనిస్తావా? నీ కొంగే పట్టుకు తిరగమంటావా'' అన్నాడు జగన్నాథ్ హాస్యంగా.

''అలా ఏం చెయ్యను. నాకెలాగూ కూతుళ్ళు లేరు. కోడలినే కూతురుగా చూసుకుంటాను. ఇద్దరూ ఆనందంగా ఉంటే చూసి సంతోషిస్తాను. ధనమక్కరలేదు, అమ్మాయికి గుణముంటే చాలు'' అంది జయలక్ష్మి.

''అయితే ప్రయత్నాలు మొదలెడదాం''

వాళ్ళు ప్రయత్నాలు మొదలెట్టకుండానే సుమన్ ఒకమ్మాయిని తీసుకొచ్చి ''ఈమె సౌమ్య. నా కొలీగ్'' అని పరిచయం చేశాడు. జయలక్ష్మి కూచోపెట్టి, అతిథి మర్యాదలు చేసి, మాట్లాడింది. సౌమ్య ప్రతిదానికీ ఆఁ అనో 'ఊ' అనో అంది తప్ప మాట్లాడలేదు. కొంతసేపు బెరుకేమో అనుకుంది కానీ జయలక్ష్మికెందుకో ఆమెకు తనతో మాట్లాడ్డం ఇష్టం లేదా అని అనుమానమొచ్చింది.

సౌమ్య వెళ్ళాక సుమన్ అసలు విషయం బయట పెట్టాడు. ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నానన్నాడు. జయలక్ష్మి నిర్ఘాంత పోయింది. తేరుకున్న జగన్నాథ్ ''పిల్ల కుటుంబమూ, సంప్రదాయమూ చూడాలి కదా'' అన్నాడు.

''ఈ రోజుల్లో కూడా కులమూ, గోత్రమూ, మతమూ చూస్తారా?'' అన్నాడు సుమన్.

''కుల గోత్రాలు కాదు వాళ్ళ కుటుంబ వివరాలు..''

''మనకన్నా కూడా వాళ్ళు డబ్బున్న వాళ్ళు. వాళ్ళ నాన్నకి బిజినెస్ ఉంది. ఇద్దరే అమ్మాయిలు''

''వియ్యానికైనా కయ్యానికైనా సమాన ఫాయా అన్నారు. మన మధ్య తరగతి ఇంట్లో ఆ అమ్మాయి ఇమడగలదా ?''

''నాకింత జీతం వస్తున్నాక మనం మధ్యతరగతేమిటి? ఎక్కువ తక్కువలు మన మనస్సులో ఉంటాయి. ఆ అమ్మాయి నా కన్నా నెల రోజులు పెద్దది. అయితే మాత్రం...''

''వరహీనమా'' అనబోతున్న జయలక్ష్మితో ''హీనం ఏమిటమ్మా, ఎవరు హీనం'' అంటూ తల్లి నోరు నొక్కేశాడు సుమన్.

మంచితనంతో కోడలి మనస్సును ఆకట్టుకుందామనుకుంది జయలక్ష్మి.

***

''అమ్మాయిని మీ చేతుల్లో పెడుతున్నాం'' అంటూ విధాయకంగా అంటున్న వియ్యపురాలి మాటలతో వర్తమానంలోకి వచ్చింది జయలక్ష్మి.

''మీరెలాగూ కట్నం వద్దన్నారు. అలాగని మేమేం ఇవ్వకుండా ఊరుకోం. అమ్మాయీ, అబ్బాయీ హనీమూన్ వెళ్ళడానికి నాలుగు లక్షలు పెట్టి ఏర్పాట్లు చేశాం. అమ్మాయికి ఇంటికి కావల్సినవి కొనుక్కునేందుకు రెండు లక్షలు బ్యాంకులో వేశాం''

ఇంట్లో అన్నీ ఉన్నాయి. కొనాల్సినవి ఏమున్నాయి? అనుకుంది జయలక్ష్మి. కోడలు సౌమ్య అలా అనుకోలేదు. హనీమూన్ నుండి వస్తూనే ఇల్లు ఆధునీకరణ పనులు మొదలెట్టింది. సుమన్, సౌమ్యా ఆఫీసుకి వెళ్ళాక జయలక్ష్మి పూజలో కూచుంది. జగన్నాథ్ బ్యాంకుకు వెళ్ళాడు.

బెల్ మోగిన చప్పుడుకు పూజలో నుంచి లేచి తలుపు తీసింది జయలక్ష్మి.

''వంటిల్లు మాడ్యులర్ కిచెన్‌గా మార్చడానికి ఎస్టిమేట్‌కి వచ్చాం''

''మా ఇల్లు కాదు. నంబరెంత''

''ఈ ఇల్లే. ఇదిగో అడ్రస్. సౌమ్యా మేడమ్ ఫోను చేశారు''.

జయలక్ష్మి తేరుకునే లోగానే పనివాళ్ళు లోపలకు వెళ్ళారు.

***

సాయంత్రం ఇంటికొచ్చిన సుమన్‌తో విషయం మాట్లాడింది జయలక్ష్మి.

''అవునమ్మా ఇల్లంతా పాత మోడల్‌గా ఉంది. సౌమ్య ఆర్టిస్ట్ తెలుసా. బొమ్మలు బాగా గీస్తుంది. ఇల్లు ఎంత అందంగా మారుస్తుందో చూడు'' ఒక్క పది రోజులు నువ్వూ, నాన్నా సరదాగా తిరిగి రండి. ఇల్లు చూసి ఆశ్చర్యపోతావు''.

ఏదో కొత్త పెళ్ళి కూతురు ముచ్చట పడుతోంది. తనకు మాత్రం పెళ్ళైన కొత్తలో అన్ని వస్తువులూ కొని ఇల్లు అలంకరించుకోవాలని ఉండేది కాదా. అమె ముచ్చటెందుకు కాదనాలి.

***

రెండు వారాల తర్వాత ఇంటికి వచ్చిన జయలక్ష్మి, జగన్నాథ్ నిజంగానే ఆశ్చర్య పోయారు. ఇంటి రూపం మారిపోయింది. మాడ్యులర్ కిచెన్, ఇటాలియన్ ఫర్నిచర్, షాండిలియర్లు.....''ఇంత ఖర్చుకి డబ్బెక్కడిది'' అన్నాడు జగన్నాథ్.

''ఆ అత్తవారు సారెకు బదులు రెండు లక్షలిచ్చారుగా నాన్నా''

''రెండు లక్షలకి ఇంత ఫర్నిచర్ రాదే''

''ఏంటి నాన్నా ఇంకా ఆడిటర్‌గానే మాట్లాడుతున్నావు. మిగతాది మా క్రెడిట్ కార్డుతో పే చేశాం''

ఇంటి స్వరూపమే కాదు జీవితం స్వరూపమే మారిపోయింది జయలక్ష్మికి. వంటింట్లోకి వెళ్ళి ముందు పొయ్యి మీద కాఫీకి పాలు పెట్టిందామె.

''ఈ పొయ్యి మీద పెట్ట కూడదు'' అంటూ స్టౌ ఆపేసిన సౌమ్య, వెనక పొయ్యి మీద పెట్టుకోండి అంది.

నాలుగు పొయ్యిలున్న గ్యాస్ రేంజి అది. నాలుగు పొయ్యిలే అనవసరమనుకున్న జయలక్ష్మికి వెనక పొయ్యికీ ముందు పొయ్యికీ తేడా కనిపించలేదు.

''ఏమిటి తేడా రెండూ ఒకేలా ఉన్నాయిగా''

''మీరే రైటు అన్న భావం మీలో బాగా పాతుకుపోయింది. రెండూ ఒక్కలా ఎలా ఉంటాయి? ఈ వెనక దాని మీద పాలు తొందరగా కాగుతాయి. ఎప్పుడూ మీ మాటే నెగ్గాలి అనుకోకపోతే నేను చెప్పినట్లు చెయ్యచ్చుగా''

జయలక్ష్మికి కళ్ళు తిరిగినంత పనయింది. మాట్లాడకుండా కాఫీ తెచ్చుకుని ముందు గదిలో సోఫాలో కూచుంది. కొత్త ఫర్నిచర్ ఆమెకు అంత సౌకర్యంగా లేదు. నాలుగైదేళ్ళుగా కాళ్ళ నొప్పులతో బాధ పడుతున్న ఆమె కాళ్ళు సోఫాలో పెట్టుకుంది.

''అయ్యో ఏమిటా పని'' అంటూ కోడలు ఆమె కూచుండగానే దుమ్ము దులిపింది. ''జాగ్రత్తగా చూసుకుని కూచోండి. వెల్క్యాన్ ఊడిపోయేను'' అంది.

''కాళ్ళు నొప్పులమ్మా సౌమ్యా. ఎప్పుడూ కాళ్ళు పైన పెట్టుకోవడం అలవాటు'' అని చెప్పింది జయలక్ష్మి.

***

మర్నాడు జయలక్ష్మి స్నానం చేసి వంటింట్లోకి వచ్చేసరికి పని మనిషి కూరలు తరుగుతోంది. సౌమ్య వంట చేస్తోంది.

''అదేమిటి సౌమ్యా. ఉదయమే పని మొదలెట్టావు. వంట నేను చేస్తాను. నువ్వు ఆఫీసుకి తయారవు''

''కాళ్ళు నొప్పులన్నారు కదా. అదీగాక ఈ కొత్త మాడ్యులర్ కిచెన్‌లు మీకు అలవాటు కావు. ఎక్కడ వస్తువక్కడ పెట్టాలి. ఏ పొయ్యికి తగిన వంట ఆ పొయ్యి మీదే చెయ్యాలి మీ వల్ల కాదు'' అంది సౌమ్య.

''అవునమ్మా! సౌమ్య చేస్తుంది. నువ్వు రిలాక్స్ అవు'' అన్నాడు సుమన్.

''పోనీ చిన్న సాయాలు చేస్తాను. పిండి పాకెట్ విప్పి గిన్నెలో పొయ్యనా'' అంది జయలక్ష్మి

''హాయిగా కూచోమంటే ఈ గోలేమిటి?''

సుమన్ జయలక్ష్మి భుజం చుట్టూ చెయ్యివేసి నడిపించి తీసుకొచ్చి హాల్లో సోఫాలో కూచోపెట్టి ''హాయిగా టి.వి. చూసుకో'' అన్నాడు.

జయలక్ష్మి నిస్సహాయంగా కూచుంది. తనకి వంట రాదా, ఇల్లు సర్దడం రాదా, నీట్‌నెస్ లేదా? ''అత్తయ్యా, ఇన్నాళ్ళూ కష్టపడ్డారు, ఇంక రెస్ట్ తీసుకోండి'' అంటే తను బాధ పడేది కాదు. మీకేం రాదు. కదలకుండా కూచోండి అంటేనే బాధ.

***

చెయ్యడానికి పనిలేక కొంతా, నీకు పని రాదన్న మాట పడలేక కొంతా జయలక్ష్మి దుఃఖంలో మునిగిపోయింది.''ఇప్పుడు బాధ పడ్డానికేముందో అర్థం కాదు. మా కొలీగ్స్ మొత్తం ఇంటి పనీ, వంట పనీ, పిల్లల పనీ అత్తగారి మీద పడేసి బలాదూర్ తిరుగుతూంటారు. నేనూ అలా ఉంటే తెలిసివచ్చేది. అన్నీ చేసి పెడుతుంటే హాయిగా తిని కూచోడమూ కష్టమేనా'' అంది సౌమ్య.

''అవునమ్మా! పాపం సౌమ్య ఇంటా బయటా కష్టపడుతోంది'' అన్నాడు సుమన్.కష్టమంటే శరీర శ్రమేనా? మానసికమైన వ్యథలుండవా? తన ఇంట్లో తను పరాయి దానిలా, నాలుగు రోజులుండి పోయే అతిథిలా ఉండటం ఎంత కష్టం. తన బాధ పరాయి పిల్ల కోడలికి తెలియక పోవచ్చు, కన్న కొడుక్కైనా తెలియద్దా?

ఆ రాత్రి భర్త భుజం మీద తలపెట్టుకుని కన్నీళ్ళు పెట్టుకుంది జయలక్ష్మి. కాపురానికి వచ్చాక ఆమె కంట కన్నీళ్ళు చూడని జగన్నాథ్‌కి ఏం చెప్పాలో, ఏం చెయ్యాలో తెలియలేదు.

''వంటింట్లోకి అడుగైనా పెట్టకుండా, ఏ పనీ చెయ్యకుండా ఉండలేక పోతున్నాను. కాళ్ళు ఎక్కడ పెట్టుకుంటే తప్పో, కాఫీ గ్లాసు ఎక్కడ పెట్టాలో తెలియక తల్లడిల్లిపోతున్నాను. ఇలా బందీలా ఉంటే నాకు మతి పోతుంది''

భార్యని ఓదార్చడం ఎలాగో తెలియక జగన్నాథ్ ఆమె తల నిమురుతూ ఉండి పోయాడు.

***

జయలక్ష్మికి మతి పోలేదు కానీ సౌమ్య నెల తప్పింది. జయలక్ష్మి ఆశ్చర్యంగా కొడుకుతో ''రెండేళ్ళైనా ఆగుతారనుకున్నాను'' అంది.

''అమ్మా తనకి ఇరవై తొమ్మిదేళ్ళు, లేటు చేస్తే కష్టం'' అన్నాడు సుమన్.

''సౌమ్యా, నువ్వు కొంచెం రెస్టు తీసుకోవాలమ్మా. ఆఫీసుకి వెళ్ళడం ఎలాగూ తప్పదు. ఇంటి పనిలో కల్పించుకోకు'' ఇక తనే కొడుక్కీ, నెల తప్పిన కోడలికీ వండి పెట్టే ఉద్దేశ్యంతో అంది జయలక్ష్మి.

''అవును నేనూ అదే అనుకుంటున్నాను. రేపటి నుంచి వంట మనిషి వస్తుంది'' అంది సౌమ్య.

''వంట మనిషెందుకమ్మా. రుచిగా, శుచిగా, నీకు నోటికి హితవుగా వండి పెడతాను. అప్పుడే పుట్టబోయేవాళ్ళు ఆరోగ్యంగా ఉంటారు. మనకి నచ్చేలా పరాయి వాళ్ళేం చేస్తారు''

''ప్రతి విషయంలోనూ మీ మాటే తప్ప ఇంకొకళ్ళ గురించి ఆలోచించరా? ఇలా అయితే ఇంట్లో ఉండడం కష్టం. నా వల్ల కాదిలాంటి చోట ఉండడం. ట్రాన్స్‌ఫర్ చేయించుకు పోతాను''

***

సౌమ్య మాట మీద నిలబడింది. ''నాతి చరామి'' అన్న మాట మీద సుమన్ నిలబడ్డాడు. ఇద్దరూ ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వేరే ఊరెళ్ళిపోయారు.జయలక్ష్మి డీలా పడిపోయింది. కొడుకుని ప్రాణంలో ప్రాణంగా పెంచుకుంది. కొడుకే ప్రాణంగా బతికింది. కోడల్ని కూతురిలా చూసుకోవాలనుకుంది. ఆమె తనను పరాయిదానిలా ఎందుకు చూసిందో జయలక్ష్మికి ఎంత ప్రయత్నించినా అర్థం కాలేదు.

డీలా పడిపోయిన జయలక్ష్మిని చూసిన జగన్నాథ్ మరింత డీలాపడి పోయాడు. తనను తానే సమాళించుకుని జయలక్ష్మిని సైకాలజిస్టు వద్దకు తీసుకెళ్ళాడు.

సైకాలజిస్టు పేరు కోమలి. పేరు లాగానే ఆమె మాట కోమలంగా ఉంది. జయలక్ష్మి చెప్పినదంతా శ్రద్ధగా, మాట్లాడకుండా వింది. జయలక్ష్మి వెక్కి వెక్కి ఏడ్చినా ఓదార్పుగా చూసిందే తప్ప తప్పొప్పులు చెప్పలేదు.

మూడు సెషన్స్ తర్వాత నెమ్మదిగా జయలక్ష్మిలో మార్పు తెచ్చే ప్రయత్నం మొదలెట్టింది. కొడుకు దగ్గర లేకుండా ఉండడంలోని కష్టాన్ని అంగీకరిస్తూనే హాబీలపైకీ, సంఘసేవ మీదకీ, ప్రయాణాల గురించీ దృష్టి మరల్చడం ముఖ్యమని జయలక్ష్మిని ఆలోచించేలా చేసింది కోమలి.

***

ఆరు నెలలయ్యేసరికి జయలక్ష్మి మామూలు మనిషైంది. కొడుకు చుట్టూనే ఆమె ఆలోచనలు తిరగడం మానేశాయి. తనకు తెలిసిన వాళ్ళు వెడుతుంటే జగన్నాథ్ భార్యను చార్‌ధామ్ యాత్రకు పంపించాడు. స్వయంగా అజంతా, ఎల్లోరా, షిర్డీ తీసుకెళ్ళాడు.

మనవడు పుట్టాడన్న వార్తనీ, సౌమ్య తల్లితండ్రులు తమ దగ్గరకు వచ్చారన్న విషయాన్నీ కొడుకు రాసిన ఉత్తరాన్ని జయలక్ష్మి ఏ ఉద్వేగమూ లేకుండా చదివింది. జగన్నాథ్ సంతోషించాడు.

***

ఏడాది గడిచింది. కొడుకు భార్యతో, మనవడితో వస్తున్నానని రాసిన ఉత్తరం చదివి జయలక్ష్మి, జగన్నాథ్ సంతోషించారు.

మనవడు రాగానే ఎత్తుకుని పొంగిపోయారు.

స్నానం, పానం, భోజనం పూర్తయ్యాక కోడలు ''అత్తయ్యా, మీరిద్దరూ ఇలా విడిగా ఉండడమేమిటి? అప్పుడేదో ఆవేశంలో అలా చేశాను. మీరు మాతో వచ్చేయండి'' అంది.

''అవునమ్మా నువ్వూ, నాన్నా ఇలా ఒంటరిగా ఉండొద్దు, నా దగ్గరకు వచ్చెయ్యండి'' అన్నాడు కొడుకు.

జయలక్ష్మి ఆనందానికీ, ఆశ్చర్యానికీ లోనయింది. మనవడు ఆమె ఒడిలోనే ఉన్నాడు. ''పిల్లాడేమిటి ఇంత సన్నగా, తేలికగా ఉన్నాడు? ఏడాదికి నువ్వు ఎంత బొద్దుగా ఉండేవాడివో. ఎవరికీ ఎత్తుకునేందుకు ఇచ్చేదాన్ని కాదు. ఇంత బరువున్నాడేమిటంటే దిష్టి తగుల్తుందని భయం వేసేది''''తల్లిపాలు తల్లిపాలే డబ్బాపాలు డబ్బాపాలే'' అంది సౌమ్య.''సుమన్‌కీ డబ్బాపాలే. నా ఆరోగ్యమంత మంచిది కాదు. అందుకే డాక్టరు రెండో సంతానానికి అవకాశమివ్వలేదు'' అంది జయలక్ష్మి.

''రేపు టిక్కెట్స్ కొననా'' అన్నాడు సుమన్.

జయలక్ష్మి జవాబు చెప్పలేదు. జగన్నాథాన్ని చెప్పనివ్వలేదు.

***

అర్ధరాత్రి కొడుకు గదిలోనుంచి గట్టిగా మాటలు వినిపించి నిద్రలేచింది జయలక్ష్మి. ఎంతగా వినకూడదనుకున్నా ఆమె చెవిలో మాటలు పడుతూనే ఉన్నాయి.

''అంతగా రమ్మని బతిమాలినా మీ అమ్మ అవుననలేదే'' సౌమ్య అరిచినట్లుగా అడుగుతోంది.

''ఎందుకు రమ్మంటున్నాం? నీకు అత్తగారి మీద ఇన్నాళ్ళకు ప్రేమ వచ్చిందా? బాబు పుట్టాక మీ అమ్మ నాలుగు నెలలు సాయముంది. ఆ పైన ఆయాను పెట్టావు. బాబు కోసం ఉంచిన పాలన్నీ ఆయాగారి కడుపులోకి వెళ్ళిపోయాయి. నేపీస్ అయినా సరిగా మార్చేది కాదు. ఆయా బొద్దుగా తయారయింది. బాబుకి నీరసం, అనారోగ్యం. నీ జీతం చాలుతుంది, ఉద్యోగం మానెయ్యమంటే నువ్వు మానలేదు''

''నేనే ఎందుకు మానాలి, నువ్వే మానెయ్యి. నీ కన్నా నాకే ఎక్కువ సర్వీసుంది''

''అవును. నా కన్నా పెద్ద దాన్ని కట్టుకున్నాను బుద్ధిలేని పని''కొంచెం సేపు అరుపులయ్యాక ''సరేలే! అమ్మని ఒప్పిస్తా'' అన్నాడు సుమన్.

***

కొడుకూ, కోడళ్ళ మాటలు విన్న జయలక్ష్మికి నిద్రపట్టలేదు. తమని రమ్మనగానే ఆనంద పడింది. ఆశ్చర్యానికి లోనయింది. ఎందుకు రమ్మంటున్నారా అని అనుమాన పడింది. అనుమానం నిజమైనందుకు దుఃఖపడింది.

మర్నాడు కొడుకు మళ్ళీ ప్రయాణం మాట ఎత్తాడు. జయలక్ష్మి నిబ్బరంగా జవాబు చెప్పింది.

''సుమన్, నువ్వు పుట్టినప్పుడు ఎంతో పొంగిపోయాను. ఇంక సంతానం కలగదని తెలిశాక నువ్వే ప్రాణంగా జీవించాను. పెరిగి పెద్దదయిన ప్రేమ వృక్షం కూకటి వేళ్ళతో పెకలించుకుని పోయినప్పుడు కుంగి పోయాను. కుంగుబాటు నుండి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాను. మళ్ళీ మనవణ్ణి పెంచి వాడి చుట్టూ ప్రేమలతను అల్లుకోను. అదే తప్పు మళ్ళీ చెయ్యను''.

✱

రచయిత ఫోన్ నెం: 040-27612246

